# మా వెర్రత్తయ్య హార్మణీ

మా వెర్రత్తయ్య అసలుపేరు సూర్యసత్య వెంకట శివ సుబ్బలక్ష్మి జనరల్‌గా అంతా సూరీడూ అని పిల్చేవాళ్ళు. మిగతా టైటిల్స్ చలామణిలోలేవు. వాళ్ళ సూరప్పమ్మమ్మ శివుడూ అని పిల్చేది. వాళ్ళమ్మ పెద్ద దెయ్యం అని నాజూగ్గా సంబోధించేది. మేవంతా చిన్న సూరీడత్తయ్యా అనేవాళ్ళం. మా మావయ్య "ఎయ్ మనిషి ఇదిగో" అనికేకేసే వాడు. మాసూరీడత్తయ్యకు నిజంగా వెర్రి వుందనుకునేరు కొంపతీసి ఆవిడకు వెర్రీలేదు, మొర్రిలేదు. ఆవిడ తమ్ముళ్ళు నోరంతా తెరుచుకుని "అప్పా-ఎవే పెద్దప్పా" అని రాచ్చిప్పను పిల్చినట్లు పిల్చేవారు.

ఆ యింట్లో తనొక్కర్తే కావటం వలన మా అత్తయ్యకు పని బద్ధకస్తురాలని టైటిలొచ్చేసింది. కూర్చున్న చోటునుంచి లేవదని, అస్తమానూ నడుంనొప్పో, కాలినొప్పో, కడుపుపోట్లో, తలనొప్పో, జ్వరమో అని ఏదోవంక పెట్టి పడుకుంటుందని పేరొచ్చేసింది. మా అత్తయ్యకు చాలా కాలం వరకు పిల్లలు పుట్టలేదు, ఒకటి రెండు మార్లు ఎవో గొడవలు జరిగినా అని నిలవలేదు. ఒకసారి చచ్చిపోయిన పిల్లాడుపుట్టాడు. దానా దీనా "అయ్యోపాపం" అనేవారు ఎక్కువయ్యారు, ఆవిడ ఎక్కువగా పుట్టింట్లో వుండేది. పుట్టింట్లో అమ్మమ్మ అంగరక్షలు పెట్టేది. తల్లి చాకిరీ చేసేది. తండ్రి తెచ్చిపడేస్తూండేవాడు అందుచేత మా అత్తయ్యకు వేరింటి కాపురమంటే సరిపడేదికాదు. అత్తచేతి తెడ్డురుచి ఆవిడకు తెలిసిరాలేదు.

మా అత్తయ్య ఎలిమెంటరీ స్కూల్లో నాలుగో క్లాసు తప్పింది. ఆవిడది నొక్కు నొక్కులజుత్తు మధ్యపాపిడి కాక పక్క పాపిడి తీసి చెంపపిన్నులు పెట్టేది, మెళ్ళోకీ చంద్రహారం వుందనుకోండి. చెవులకు లోలక్కులు పెట్టుకునేది. ఒంటిరాయి ముక్కుపుడక. చేతులకి రెండు జతల గాజులు కాళ్ళకు వెండి పట్టాలు వున్నాయి. అలంకరించుకొనాలనీ, అందంగా కనిపించాలనీ అందరాడవాళ్ళూ తాపత్రయపడతారు, అది సహజమే - మా అత్తయ్య తాపత్రయంలో అసహజవైనదేదో వున్నట్లు అందరికీ తెలిసిపోయేది. ఆవిడ కాంచన మాలలానో, పుష్పవల్లిలానో వుండాలనుకునేది. మోడ్రన్‌గా వుండాలనుకొని ఎవో పిచ్చిపనులు చేస్తూ వుండేది. అందుచేత ఆవిడకు వెర్రత్తయ్య అనే బిరుదు వచ్చేసింది.

చద్దెన్నం తినకపోతే ఆవిడ వుండలేదు. కాఫీలు టీలు, టిఫిన్‌లు అప్పటికింకా ఇళ్ళల్లోకి రాలేదు. చద్దెన్నం కొట్టేసి చాపమీద కూర్చుని హార్మణీ వాయించేది. మా అత్తయ్యది కీచుగొంతుక. ఆవిడ పాడుతూ హార్మణీ వాయిస్తూంటే హార్మణీని, ఆవిడని ఎత్తికెళ్ళి అవతల పడేసి ఫినాయిలెట్టి అయిల్లు కడిగించి ఆ గోడలకు వెల్లవేసి మళ్ళీ ఇంటి కప్పు తిరగెయ్యాలనిపించేది కాని ఏం చేస్తాం? ఆ హార్మణీ ఆవిడ చేసుకున్న పాపం లాంటిది. ఆవిడ సంగీతం మాచెవులకు శాపం కాని ఆవిడ ప్రాణానికది ఇంద్రచాపం.

ఆవిడ సంప్రదాయ కీర్తనలేవీ వాయించేది కాదు. పాత సినిమా పాటలు, నాటకాలలోని బాణీలు వాయిస్తూ కూర్చునేది. ఆవిడ హార్మణీ పెట్టెలో ఎక్సర్‌సైజు బుక్కుల నిండా పాత సినిమా పాటలు కోకొల్లలుగా వుండేవి. అవన్నీ రాసుకుందుకు అందులో ఒక వయిలెట్ పెనసలు కూడా రడీగా వుండేది.

మా మావయ్య కొంతకాలం పాండురంగ విఠల్ భజనలు తరవాత కుసుమ హరనాథ్ భజనలు చేసేవాడు. సాయిబాబా వచ్చాక కొంత మంది కుసుమ హరనాథ్ బాబా భక్తులు సాయిబాబా భక్తులుగా ప్లేటు ఫిరాయించారు. మా మావయ్య మాత్రం పాత కాంగ్రెసుని నమ్ముకున్నట్లు చాలాకాలం కుసుమహరనాథ్‌బాబానే నమ్ముకుని శక్తివంచన లేకుండా సినిమా కీర్తనల బాణీలో పాటలుచేస్తూ వాటికి మా అత్తయ్య హార్మణీ మీద వరసలుకడుతూ కాలక్షేపం చేశాడు. భక్తి రసంలోకి సినిమా రసాన్ని కూడా జోడించాక కాని మా అత్తయ్య ఆ పాటలను హార్మణీ మీద కెక్కించలేదు. పాప్యులర్ హిందీ సినిమా పాటలన్నిటికీ హరనాథ్ బాబా భజన పాటలు కట్టి భజనలో మా మావయ్య పాడుతూండేవాడు. అతని దగ్గర ఒక కంజెర కూడా వుండేది. మా అత్తయ్య కూడా తన సహజ కీచుగొంతుకతో బ్రతిమాలించుకుని ఒకటీ రెండు కీర్తనలు గానం చేసేది. భజనల వలన ఒక లాభం వుంది. ఎంత పాటరానివాడైనా ఏవో రెండు చరణాలు పాడి పాట సరదా తీర్చుకోవచ్చు. హరనాథ్ బాబా భక్తులలో వున్న సొగసేవిటంటే వారి కృష్ణభక్తిని కూడా హరనాథ్ బాబా పరంగా తీర్చుకోవటానికి వీలయేది. ఏకాహాలు, సప్తాహాలు జరిగేవి. మా చుట్టాలలో ఒకడికి హరనాథ్ బాబా ఒంటి మీదకు వచ్చేవాడు. వాడికి వస్తాడని అందరికీ ముందుగానే తెలుసు. ఎర్రటి పట్టుబట్టకట్టి కాళ్ళకు గజ్జెలుకట్టి వాడ్ని వదిలేస్తే వాడు పందిరంతా దున్నేసేవాడు. “హరిబోల్ – హరిబోల్” అంటూ వాడు చిందులుతొక్కి ఓసారి మా అత్తయ్య హార్మణీ మీదొచ్చి పడ్డాడు. దరిమిలాను ఆవిడ తన హార్మణీని భజనలకు తీసుకెళ్ళడానికి వీల్లేదని కట్టుదిట్టాలు చేసింది. సాక్షాత్తు భగవంతుడైనా హార్మణీ విరగ్గొడితే మళ్ళీ పదో పరకో యిచ్చి బాగుచేయించుకోవాల్సిందే గదా!

“లవ్ సాంగ్స్, సినిమా సాంగ్స్” అంటే మా అత్తయ్య కిష్టం. అవే పాడేది ఇరుగు పొరుగు పిల్లలకు కూడా ఆపాటలు నేర్పి హార్మణీ మీద వరసలు వాయించి చూపేది, అలా పాడడం మోడ్రన్ అని ఆవిడ అభిప్రాయం.

ఆ హార్మణి ఆవిడకు మొగుడి తరువాత మొగుడంతటిదయిపోయింది. భర్తది భక్తి రసం పెళ్ళానిది సినిమా రసం కావటం వలన వారుభయులూ పట్టింపులు లేకుండా సంగీత సాధనకు అంకితమైపోయారు. వారి జీవితాల్లో చాలా మార్పులొచ్చేశాయి. అప్పులు చేసి తింటూ కూర్చోటం వలన పొలం, పుట్రా యిల్లూ వాకిలీ అన్నీ తాకట్టులోకి వెళ్ళిపోయాయి. చంద్రహారం, చేతి రెండు జతల గాజులూ అమ్మేయాల్సొచ్చింది. ఇన్ని అమ్మినా ఆవిడెప్పుడూ హార్మణీ మీద చేయి వేయినివ్వలేదు. ఆవిడ హార్మణీ వాయించుకోవటం తనకు నచ్చిన కీర్తనలను ఒకసారి వాయించి చూసుకోవటం ఎన్నడూ మానలేదు. ఈ మధ్యకాలంలో ఆవిడకొక ఆడపిల్ల పుట్టి

పెరిగి పెళ్ళయి అత్తవారింటికి కూడా వెళ్ళిపోయింది. "ఏవిటే వెర్రి పాటలూ నువ్వూనూ" అని ఆ పిల్ల తల్లి మీద విసుక్కునేది. తన తల్లి సంగీత సాధన ఆ యింటి అల్లుడుగారెక్కడ వింటాడోనని ఆ అమ్మాయి హడిలిపోయేది. హార్మణీని దాచటం శక్యంకాక తన పడగ్గదిలో పందిరి మంచం కింద కొన్నాళ్లుంచింది.

ఈ ఒక్క పిల్లా కాపరాని కెళ్లాక మా అత్తయ్యకు మళ్లీ కడుపొచ్చినట్టు అనుమానం కలిగింది. మగపిల్లాడు పుట్టాడేమోనని ఆవిడ సంతోషంతో అవీ యివీ చేసుకుని తినటం మళ్ళీ పాటలు పాడ్డం మొదలెట్టింది. ఆవిడ చాలా హడావిడి చేశాక లేడీ డాక్టరు కడుపూ కాదూ కాలూ కాదునోరుమూసుకోమని చెప్పింది. అది చాలా పెద్ద షాక్–ఆవిడ దిగాలు పడిపోయింది. కూతురొచ్చి చివాట్లేసింది. ఆవిడలాగే ఆ హార్మణీ కూడా చాలా పాతబడి ముసలిదై పోయింది. నల్ల మెట్లేవో తెల్ల మెట్లేవో తెలుసుకోవడం కష్టం. హార్మణి తిత్తికిచిల్లులు పడిపోయాయి. అందులోకి గాలి దూరి వికృతమైన శబ్దాలు వస్తున్నాయి. మా అత్తయ్యకి కడుపులో కేన్సరన్నారు. ఆవిడ బాగా లావెక్కి అదోలా తయారయింది. ఇప్పుడెవరేనా సూరీడూ ఒక పాట పాడూ అంటే ఆమె కళ్ళలో మెరిసే తళుకు చూస్తే చాలు వెంటనే ఆవిడ కళ్ళలో నీళ్లు తిరుగుతాయి. హార్మణీ బాగుచేయించమని ఆవిడ మొగుడ్ని వేధిస్తుంది. చూద్దాంలే అంటాడతను మీ అమ్మాయికి హార్మణీ చెప్పిస్తున్నారా అని అడుగుతుంది. వాళ్లు లేదంటే వాళ్లతో సరిగా మాట్లాడదు, మొన్నీమధ్య ఆ హార్మణీ పెట్టెలో ఒక ఎలక పన్నెండు పిల్లల్ని పెట్టింది. పాటల పుస్తకాన్ని చదలు తినేశాయి. ఆవమొలెట్ పెసపలు దానికో తుప్పు పట్టిన కీఫ్, అది అరిగిపోయి చిటికెన వేలంత వున్నది. ఓసారి పోరు పడలేక మావయ్య ఆ హార్మణీ షాపుకి పట్టికెళ్లి యిచ్చాడు. బాగుచేయటాని కెంతవుతుందో కనుక్కుందామని. నా హార్మణీ తీసుకురారేమని ఆవిడ ఒకటే గొడవ. ఆ షాపు ఎప్పుడు తాళం వేసుంటుందే అని అతను జవాబిచ్చాడు. ఆ షాపు వాడు పెట్రోమాక్సు లైట్లు గ్రామఫోను బాగుచేస్తాడు. హార్మణీ సంగతి వాడికి తెలీదు. ఆ నిజం వాడు వప్పుకోడు. అందుకని మా వెర్రత్తయ్య హార్మణీ ఆ షాపులో ఓ మూలపడి వెర్రి చూపులు చూస్తోవుంటుంది. దాన్నెవరు పలికించ గలరు. అది ఎట్లా పలుకుతుంది.

# సంభవంతి దినే దినే

**త**న కోపమే తన శత్రువు అన్నాడు వేమన. చచ్చాం వేమన కాదు సుమతీ శతకం చెప్పినాయన అన్నాడ్ట తన శాంతమే తనకు రక్ష అని మరొకడెవడో ఠపీమని అనేశాడు. శాంతమూ లేక సౌఖ్యమూ లేదూ సారస దళనయనా అన్నాడు త్యాగరాజు. రామదాసు అలాగన్లేదు. "ఎవ డబ్బా సొమ్మని కులుకుచూ తిరిగేవు రామచంద్రా" అన్నాడు. గాంధీ గారు